క్లుప్తంగా

వచ్చే విద్యా సంవత్సరానికి మైనార్టీ బాలికల వసతిగృహం

కర్నూలు(అర్బన్): ప్రధానమంత్రి జన వికాస కార్యక్రమం కింద మంజూరైన మైనారిటీ పోస్టు మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆమోదంతో వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేస్తామని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎ.సునీల్‌కన్నా తెలిపారు. ఈ పథకం కింద మైనారిటీ బాలికల వసతిగృహం నిర్మాణానికి రూ.2.10 కోట్లు మంజూరయ్యాయన్నారు. వసతి గృహాన్ని నిర్మించేందుకు మంగళవారం ఆయన ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ లక్ష్మినారాయణ, డీఈఈ గోన నాగరాజుతో కలిసి స్థానిక గడియారం ఆసుపత్రి సమీపంలోని ప్రీమెట్రిక్ బాలికల వసతి గృహం పై భాగాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఈ నిధులు మంజూరయ్యాయని, వసతి గృహ నిర్మాణం పూర్తయితే ఇదే ఆవరణలో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థినీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

సదస్సు జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఫిబ్రవరి 17వ తేదీన సీ క్యాంపులోని లలితకళా సమితిలో నిర్వహించే ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు డి.గౌస్‌దేశాయ్, బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. మంగళవారం సలాం ఖాన్ ఎస్టీయూ భవన్‌లో భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ, ప్రజాస్వామ్య రక్షణ ప్రాంతీయ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేసి మాట్లాడారు. సదస్సుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాల గౌడ, సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ప్రశాంత్‌భూషన్, రాజ్యాంగ విశ్లేషకులు ఫైసల్‌ఖాన్, భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, కో-కన్వీనర్ విజయరావు, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ.తదతరులు అతిథులుగా హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఆనంద్‌బాబు, జగన్నాథం, ఎస్ఎన్ రసూల్, ఎస్.మునెప్ప, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విశ్వకర్మ ఇంప్లిమెంటేషన్ కమిటీలో జిల్లా వాసులు

కర్నూలు కల్చరల్: ప్రధాన మంత్రి - విశ్వకర్మ కర్నూలు జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యులుగా పలువురు జిల్లా బీజేపీ నాయకులు నియమితులయ్యారు. కాళింగి నరసింహ వర్మ, అంబలి కాశీ విశ్వనాథ్, మలేకర్ శ్రీనివాసులును నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం అమలు తీరుతెన్నులను వారు పర్యవేక్షించనున్నారు.

అలరించిన భూకైలాస్ హరికథ



హరికథ వినిపిస్తున్న కళాకారుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన టి.సాయిరాం భాగవతార్ వారిచే భూకై లాస్ పై హరికథ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కీబోర్డు సహకారాన్ని పి.ధనుంజయ, మృదంగ సహకారాన్ని పి.ప్రసాద్ అందించారు.

బూత్ కమిటీల నియామకాలను త్వరగా చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్) : ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణమైన రావచ్చని, ఈలోపు బూత్‌కమిటీల నియామకాలను త్వరగా పూర్తి చేయాలని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు పార్టీ నాయకులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జిల్లాలో పోలింగ్ బూత్‌ల వారీగా కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జాన్ విల్సన్, బతుకన్న, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16న రవాణా రంగ సమ్మె

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ విధానాలతో రవాణా రంగాన్ని కుదేలు చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 16వ తేదీన చేపడుతున్న దేశవ్యాప్త రవాణా సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం బళ్లారిచౌరస్తాలో సమ్మె జయప్రదం కోసం చేపట్టనున్న జీపుజాతాను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.నరసింహులు, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

- 16వ తేదీన చేపట్టే పారిశ్రామిక, రైతు, గ్రామీణ, రవాణా రంగ కార్మికుల టైర్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీ యూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం కార్మిక,కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బీజేపీ అధికా రంలోకి వచ్చాక రైతులు, కార్మికుల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. కార్యక్రమంలో ఆర్.నరసింహులు, సీహెచ్ సాయిబాబా, టి.రాముడు పాల్గొన్నారు.

సకల విద్యా ప్రదాత సరస్వతీ!

- నేడు వసంత పంచమి
- చిన్నారుల అక్షరాభ్యాసానికి పవిత్రమైన రోజు
- సరస్వతీ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- కొలను భారతిలో పట్టువస్త్రాలు సమర్పించనున్న శ్రీశైల దేవస్థానం



ప్రత్యేక అలంకరణలో సరస్వతీ దేవి



కొలను భారతి క్షేత్రం

ఆధ్యాత్మికం

కర్నూలు కల్చరల్: సమస్త విద్యలతో సకల కళలతో అశేష విజ్ఞాన దేవి సరస్వతి అవతరించిన పుణ్యదినమే వసంత పంచమి. మాఘ శుద్ధ పంచమి నాడు జరుపుకునే ఈ పండుగనే సరస్వతీ జయంతి, మదన పంచమి లాంటి పేర్లతో కూడా పిలుచుకుంటారు. ఇది రుతు సంబంధమైన పర్వం. వసంత రుతువుకి స్వాగతం పలికే పండుగగా శాస్త్రాల్లో ఉంది. శ్రీ పంచమిని విద్యారంభ దినోత్సవంగా భావిస్తారు. మన జిల్లాలో కొలను భారతిలో, నన్నూరు సమీపంలోని రాగమయూరిలో సరస్వతీ ఆలయాలు ఉన్నాయి. నేడు వసంత పంచమి సందర్భంగా ఆయా అలయాల్లో పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయిస్తారు.

'సర్వ చైతన్య రూపాం తాం
ఆద్యం విద్యాం చ ధీమహి
బుద్ధిం యోనః ప్రచోదయాత్' అంటూ వ్యాసుడు అమ్మకు ఆదీ అంతాలు లేవంటూ స్తుతించాడు. మూల ప్రకృతికి వ్యక్త రూపాలైన గణేశ, రాధ, లక్ష్మీ, సరస్వతి, సావిత్రి రూపాల్లో ఒకరిగా సరస్వతిని దర్శించాడు. సాక్షాత్తూ బ్రహ్మదేవుడే.. సరస్వతిని పూజించి బ్రహ్మ జ్ఞానాన్ని పొందాడని ఇతిహాసాల్లో చెప్పబడింది. జ్ఞానానికి అధిదేవత సరస్వతి. ఆమె జ్ఞాన స్వరూపిణి. శాస్త్రం, కళలు, విజ్ఞానం, హస్తకలు తదితర వాటిని చదువుల తల్లీ సరస్వతి అంశాలుగా మన పండితులు భావిస్తారు. సృజనాత్మక శక్తికి స్ఫూర్తికి కూడా వీణాపాణి అయిన సరస్వతిని సంకేతంగా చెబుతారు.

ఏపీలో ఏకైక సరస్వతీ ఆలయం

నల్లమల అభయారణ్యంలో వెలసిన కొలనుభారతి క్షేత్రాన్ని 11వ శతాబ్దంలో చాళుక్యులు నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో బాసర తరువాత రెండో ఆలయం ఇది. ఆంధ్రప్రదేశ్‌లో ఏకైక సరస్వతి ఆలయమైన ఈ క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. అమ్మవారు స్వయంభువుగా ఇక్కడ వెలిసినట్లు పురాణాలు చెబుతున్నాయి. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఈ క్షేత్రంలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. భారత ఖండాన్ని భరతమాతగా పిలువడానికి మన దేశంలో ఉన్న ఏకైక సరస్వతి ఆలయం కొలను భారతి కావడం విశేషం. ఆలయ సమీపంలో చారు ఘోషిణి నది ప్రవహిస్తూ ఆహ్లాదాన్ని పంచుతుంది. కొత్తపల్లి మండలం శివపురం గ్రామం సమీపంలో ప్రకృతి ఒడిలో వెలిసిన ఈ క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు ఏటా ఘనంగా నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల ప్రజలే కాకుండా తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర ప్రాంతాల ప్రజలు ఇక్కడికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుంటారు. తల్లిదండ్రులు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తారు.

చిన్నారుల అక్షరాభ్యాసానికి శ్రేష్టం



మాఘ మాసం నవ చైతన్య వికాసానికి, సరస్వతి మనోవికాసానికి ప్రతీక. చిన్నా పెద్ద తేడా లేకుండా సరస్వతీ దేవిని పూజించడం వల్ల స్తబ్ధత, ఉదాసీనత తొలగిపోతుంది. వసంతున్ని, మదనుణ్ణి, రతీ దేవిని పంచమి నాడు పూజించడం వల్ల వ్యక్తుల మధ్య ప్రేమాభిమానాలు, జ్ఞాన ప్రవాహాలు ఏర్పడతాయి. వసంత పంచమి రోజు చిన్నారుల అక్షరాభ్యాసానికి శ్రేష్టమైంది. లక్ష్మీదేవి, విష్ణుమూర్తికి పూజలు నిర్వహించడం, దానాలు చేయడం వల్ల పుణ్య ఫలం సిద్ధిస్తుంది.

– మామిళ్ల పల్లె యశోధరకుమార శర్మ, వ్యవస్థాపకులు, సరస్వతీ దేవి ఆలయం, నన్నూరు

హనుమద్ వాహనంపై ఊరేగిన శ్రీవారు



కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు మంగళవారం స్వామివారికి పంచామృతాభిషేకం, హోమాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హనుమద్ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. మహిళల కోలాటాలు, నృత్యాలు ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను తెచ్చాయి. కాశీ హరిద్వార్‌కు చెందిన అఘోరాలు స్వామివారిని దర్శించుకున్నారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి హెచ్‌కే మనోహర రావు, కమిటీ సభ్యులు మాధవ ప్రభు, ప్రభాకర్, శివ రామ ప్రసాద్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

• 16న రథసప్తమి

కర్నూలు కల్చరల్: టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బి.తాండ్రపాడు క్రైడో పాఠశాలలో వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. క్రైడో పాఠశాల కరస్పాండెంట్ శ్రావ్యా కార్తీక్, లలితా పీఠం పీఠాధిపతులు గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, ధర్మ ప్రచార మండలి సభ్యులు అనంత అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామి ఆలయంలో..

నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయం పంచమ వార్షికోత్సవం, రథసప్తమిని పురస్కరించుకుని నేటి నుంచి ఈనెల 18వ తేదీ వరకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

• మహావీర్ మూర్తికి పూజలు



కర్నూలు కల్చరల్: జైన్ శ్వేతంబర్ మూర్తిక్ సంఘ్ ఆధ్వర్యంలో నగర శివారులోని జైన్‌ల ఆలయం మహావీర్ ధామ్ మొదటి వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జైనులు మహావీర్ మూర్తి విగ్రహాన్ని అలంకరించి దర్శించుకున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



లబ్ధిదారులకు ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు : రాష్ట్రంలోని ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఐక్య సంఘం కార్యాలయం వద్ద ఎంపీడీఓ మల్లీశ్వరి అధ్యక్షతన 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో పొదుపు రుణాలు రద్దు చేస్తామని, బ్యాంకుల్లో తాకట్టుపెట్టిన బంగారాన్ని ఇళ్లకు తెప్పిస్తామని హామీలు ఇచ్చి చివరకు చేతులు ఎత్తేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీల మేరకు దశలవారీగా ఆసరా పథకంతో మహిళల బ్యాంకు రుణాలను మాఫీ చేశారన్నారు. ఆసరా పథకం ద్వారా మండలానికి ఈ ఒక్క ఏడాదిలోనే 873 పొదుపు సంఘాలకు రూ.5.29 కోట్లు రుణాలు చెల్లించడం హర్షించదగ్గ విషయమన్నారు. గత నాలుగేళ్ల కాలంలో మొత్తం రూ.21.30 కోట్ల మేర రుణమాఫీ చేశారని చెప్పారు. చంద్రబాబు పాలనకు, జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మధ్యగల వ్యత్యాసాలను ప్రతి అక్కాచెల్లెమ్మలు గుర్తించాలని కోరారు.

డీబీటీ, నాన్‌డీబీటీల ద్వారా రూ.4లక్షల కోట్లు ఖర్చు

మహిళల ఆర్థికాభివృద్ధి కోసం డీబీటీ, నాన్‌డీబీటీల ద్వారా గత నాలుగేళ్లలో దాదాపు రూ.4లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద విద్యార్థులకు సైతం ఇంగ్లిష్ మీడియం చదువుకునే అవకాశం కల్పించిన గొప్ప మనస్తత్వం జగనన్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను రద్దు చేయాలని టీడీపీ వారు కోర్టుకెళ్లారని చెప్పారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేసి, పారదర్శకమైన సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆసరా మెగా చెక్కును మహిళలకు అందజేయగా.. పొదుపు మహిళలు జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సర్పంచు నాగేశ్వరమ్మ, సింగిల్ చైర్మన్లు చంద్రశేఖర్ రెడ్డి, నాగతిరుపాలు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, తైమున్నిషా, ఏపీఎం వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ రోజు

దామోదరం సంజీవయ్య జయంతి



కర్నూలు(అర్బన్): ఏఐసీసీ అధ్యక్షులు, తొలి దళిత ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య జయంతిని ఈ నెల 14వ తేదీన (నేడు) ఘనంగా నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె. రంగలక్ష్మీదేవి తెలిపారు. స్థానిక నంద్యాల చెక్‌పోస్టులో ఉన్న దామోదరం విగ్రహానికి ముందుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం అక్కడే జయంతి సభ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమాల్లో జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు, దళిత, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని జేడీ కోరారు.

ఓరియెంటేషన్ ప్రోగ్రాం

కర్నూలు కల్చరల్: జాతీయ బాలల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు బుధవారం ఉదయం 10 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఒక్క రోజు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శ్యామూల్ తెలిపారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో ఉండే ఆందోళన, ఒత్తిడిని తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిష్ణాతులైన రీసోర్స్ పర్సన్లతో అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులందరూ పాల్గొనాలని మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

శాశ్వత అభివృద్ధి కనిపించదా?



అభివృద్ధి పనుల శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

- టీడీపీ నాయకులపై మేయర్, ఎమ్మెల్యే ధ్వజం
- విమర్శించే ముందు నగరాభివృద్ధి చూడాలని హితవు
- ఇంటింటికి అందించిన సంక్షేమాన్ని నిరూపిస్తాం
- రూ.1.58 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

కర్నూలు (టౌన్) : ఐదేళ్లలో తాము నగరంలో చేపట్టిన శాశ్వత అభివృద్ధి పనులు టీడీపీ నాయకుల కళ్లకు కనిపించవా..? అని నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ప్రశ్నించారు.. అభివృద్ధి జరగలేదని విమర్శించే వారు నగరంలో తిరిగి చూస్తే తెలుస్తుందని చెప్పారు. వైఎస్ జగన్ పాలనలో రూ. కోట్లు విలువ చేసే ప్రగతి పనులు చేపట్టడంతో పాటు ఇంటింటికి సంక్షేమం అందించామన్నారు. దీనిని నిరూపించేందుకు తాము సిద్ధమని సవాల్ విసిరారు. స్థానిక 5 వ వార్డు జమ్మిచెట్టు సమీపంలోని హిందూ శ్మశాన వాటికలో 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో ఆధునీకీకరించిన సుందరీకరణ పనులను మంగళవారం సాయంత్రం వారు ప్రారంభించారు. అలాగే 2 వ వార్డు ఖిల్లా వీధిలో రూ.55 లక్షలు, 3 వ వార్డు బండిమెట్టలో రూ. 53 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ కాల్వలు, పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నగరంలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో వార్డుల్లో తిరిగి ప్రజలు కోరిన పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. మెట్రో సిటీలను తలదన్నె విధంగా కర్నూలు నగరంలో విశాలమైన రోడ్లు, డివైడర్లు, పచ్చదనం, సుందరీకరణ పనులు, ఆకట్టుకునే పార్కులు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు తదితరవి చేపట్టామన్నారు. మున్సిపల్ అధికారుల సహకారంతో క్లీన్ సిటీగా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో నగరపాలక డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, స్టాండింగ్ కమిటీ సభ్యులు సుజాత, కార్పొరేటర్లు షేక్ నీలోఫర్, షాజహాన్ పరీ వ్రన్, మాజీ కార్పొరేటర్ శేషు యాదవ్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు రైల్వే ప్రసాద్, వక్ఫ్‌బోర్డు సభ్యులు ఫైరోజ్, రాంబోట్ల దేవాలయం కమిటీ డైరెక్టర్ రాజేశ్వరమ్మ, స్థానిక వార్డు నాయకులు జెట్టి యాదవ్, చాంద్, కన్వీనర్లు ఖాదర్‌బాషా, ఖుద్దూస్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

- జేసీసీ చైర్మన్ వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల ఆర్థికపరమైన డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉమ్మడి కర్నూలు జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి అన్నారు. డిమాండ్‌లను సాధించుకోవడమే లక్ష్యంగా ఈ నెల 14 నుంచి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందుకు అన్ని శాఖల ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు సహకరించాలని కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఉద్యోగులు, టీచర్లు, కార్మికులు, పెన్షనర్ జేఏసీ సమావేశం చైర్మన్ వెంగళ్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12వ పీఆర్‌సీ ఆలస్యమవుతున్నందున వెంటనే 30 శాతానికి తగ్గకుండా మధ్యంతర భృతి(ఐఆర్) ఇవ్వాలని సూచించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వీటి సాధనకు ఈనెల 14 నుంచి 20 వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి వివిధనిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21 నుంచి 24 వరకు రాష్ట్ర నాయకులు జిల్లాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. 27న చలో విజయవాడ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సమావేశంలో జేఏసీ వైస్ చైర్మన్ జవహర్‌లాల్, ఏపీ ఎన్‌జీవో అసోషియేషన్ కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, యూటీఎఫ్ నేత నవీన్‌పాటి, ఎస్టీయు నాయకుడు గోకారి, ఏపీటీఎఫ్ నేత ఇస్మాయిల్, ఏపీపీటీఏ నేతసేవాలాల్, క్లాస్-4 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిప్రకాశ్, ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, ట్రెజరీ ఉద్యోగుల సంఘం నేత కరుణాకర్, పాఠశాల విద్య ఉద్యోగుల సంఘం నేత బలరామిరెడ్డి, సీటీవో ఉద్యోగుల సంఘం నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల బాస్కెట్‌బాల్ పోటీలు మంగళవారం సాయంత్రం ముగిశాయి. విజేతలుగా నిలిచిన రిడ్జ్ , సెయింట్ జోసఫ్, అధీనా, ఎస్‌డీఆర్ పాఠశాలల జట్లకు బహుమతులు అందజేశారు. సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు జాఫర్ మున్నా, శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

కృష్ణగిరి: కంబాలపాడు జెడ్పీస్కూల్ విద్యార్థి బి.వెంకటేశ్వర్లు అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పాఠశాలలో మంగళవారం విద్యార్థి వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మయ్యను ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆయన అభినందించారు. గతేడాది డిసెంబర్ 20న కర్నూలులో జరిగిన అథ్లెటిక్ షాట్‌పుట్‌లో జి.వెంకటేశ్వర్లు ప్రథమస్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

వైద్య విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లతో సమీక్షలో ఆసుపత్రి సూపరింటెండెంట్



మాట్లాడుతున్న డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య విద్యా బోధన పై ఆచార్యులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్ తదితర విషయాలపై హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో పలు విభాగాల్లో ఆరోగ్యశ్రీకి సంబంధించి ప్రతి వారం ఇచ్చే లక్ష్యాలను పీడియాట్రిక్, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ విభాగాలు బాగా చేశాయని అభినందించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో ఈ-హాస్పిటల్ అమలు బాగా జరుగుతోందని కొనియాడారు. ఆసుపత్రి, మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థుల తరగతి హాజరు, విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని చెప్పారు. ఆసుపత్రిలోని సర్జికల్ ఆంకాలజి, మెడికల్ ఆంకాలజి, రేడియేషన్ ఆంకాలజీలకు ప్రత్యేకంగా ఓపీలు ఇవ్వాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఎఫ్ఎంసీ విభాగంలో మెడికల్ అంకాలజి 10 పడకలతో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అన్ని విభాగాల్లో వైద్యుల హాజరు రిజిస్టర్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పి. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంవో బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, డాక్టర్ రాధారాణి, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ఇక్బాల్ హుసేన్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మరణాలపై సమీక్ష

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెలవారీ మరణాల గురించి మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మరణాలతో పాటు జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగాల్లో రెండు కేస్ షీట్‌లపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ ఇక్బాల్ హుసేన్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ శ్రీనివాసులు, ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ





అత్యుత్తమ పర్సెంటైల్ సాధించిన విద్యార్థులతో వరుసగా నారాయణ కళాశాల అధ్యాపక బృందం, చైతన్య కళాశాల అధ్యాపకులు

కర్నూలు కల్చరల్: ఎన్‌టీఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ (ఫేజ్-1) పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నారాయణ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ పర్సెంటైల్ సాధించినట్లు ఆ కళాశాల డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, డీన్‌లు అంజనేయరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, నరసింహరావు తెలిపారు. షాహిద్ అలీఖాన్ 99.93, బి.వేదవ్యాస్ 99.92, పి.సాకేత్ సాయి మణికంఠ 99.71, ఎస్.సాకేత్ రామ్ 99.62, ఆర్.సాయి అభినయ్ 99.49, ఎం.ధనుంజయ్ సాయి 99.16, టి.సాయినిఖిల్ రెడ్డి 98.88, ఎం.లాస్య 98.54, టి.ప్రణీత 98.35, టి.కె. సౌమ్యశ్రీ 98.30, ఎం.హారిక 98.23 పర్సెంటైల్ సాధించారన్నారు. అలాగే 99 పర్సెంటైల్ పైన ఆరుగురు, 98 పైన 11 మంది సాధించినట్లు చెప్పారు.

- జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు అత్యుత్తమ పర్సెంటైల్ సాధించారని కళాశాలల ఏజీఎం మురళీకృష్ణ, డీన్‌లు సరళ, బాలాజీ పేర్కొన్నారు. పి.ప్రణీత్ రెడ్డి 99.77 పర్సెంటైల్, పి.ఉమా లికేష్ 98.75, ఐ.కిరీటి కీర్తన్ 98.65, డి.నోయల్ 97.58 పర్సెంటైల్ సాధించారన్నారు. పి.ప్రణీత్ రెడ్డి ఫిజిక్స్ విభాగంలో 100కు 100 పర్సెంటైల్‌తో అసాధారణ ప్రతిభ కనపరిచాడని పేర్కొన్నారు. విజేతలను వారు ఈ సందర్భంగా అభినందించారు.
- ఎస్ఆర్ రెసిడెన్షియల్ విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ కాలేజ్ జోనల్ ఇన్‌చార్జ్ టి.రఘువీర్ తెలిపారు. సూరపురెడ్డి భద్రీనాథ్ రెడ్డి 98.22 పర్సెంటైల్, బత్తుల రాజశేఖర్ 98.01, ప్రహ్లాదరెడ్డి 96.87, తేజేశ్వర కార్తికేయమూర్తి 96.23, సాయి తేజశ్రీ 95.9, కె.హన్సిక 94.60, ఎం.చరణ్‌తేజ 93.69, బి.సాయిసృజన్ 92.36, జయరంగారెడ్డి 92.02 పర్సెంటైల్ సాధించినట్లు వెల్లడించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎస్ఆర్ రెసిడెన్షియల్ కాలేజ్ జోనల్ ఇన్‌చార్జ్

ఘనంగా సరోజినీ నాయుడు జయంతి



సరోజినీ నాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కర్నూలు కల్చరల్: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సరోజినీ నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. సరోజినీ నాయుడు జయింతిని రోజును జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్క మహిళా దృఢమైన ఆత్మవిశ్వాసంతో ముందుకు రావాలన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ విక్టర్ భాను మాట్లాడుతూ సరోజినీ నాయుడు జీవితాన్ని ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహిళా సాధికారతపై కవితల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఫామిదాబేగం, డాక్టర్ షానవాజ్, డాక్టర్ స్వప్నశ్రీ, పార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.